

# అంజనం

**చంద్ర**

స్కూళ్ళు వదిలారు—

గేటు అవతల వున్న బాదంచెట్టు క్రింద జులపాలు వేలాడుతున్న నల్లటి మనిషి, "అదిగో ఆ నీలం నిక్కరు వేసుకున్న పిల్లాడు... వాణ్ణి పిలవండి! వాడు పనికొస్తాడు," అన్నాడు ప్రక్కనుంచున్న లాల్చీ పెద్దమనిషితో.

లాల్చీ పెద్దమనిషి తుపాకిదెబ్బ తిన్న పులిలా, బుజాన పుస్తకాలసంచీ వేలాడేసుకుని కుడిచేత్తో టిఫిన్ డబ్బా పట్టుకుపోతున్న అబ్బాయికేసి పరిగెత్తాడు.

"బాబూ!"

"............"

"ఓ బాబూ .. నిన్నే!"

నారిబాబు ఆగి వెనక్కి తిరిగి 'నన్నా?' అన్నట్టు చూశాడు.

"మాట !" లాల్చీ పెద్దమనిషి పిలిచాడు.

నారిబాబు లాల్చీపెద్దమనిషి దగ్గరగా వచ్చి "ఏంటి ?" అన్నాడు.

"నీ పేరేంటి ?"

"నారిబాబు," అని ఆయనకేసి ప్రశ్నార్థకంగా చూశాడు నారిబాబు.

"చిన్నపని చేసిపెడతావూ? అదిగో ఆ చెట్టుక్రిందున్న మనిషి నీ చేతిలో అంజనం పూస్తాడు. అందుట్లో నీ కేం కనిపిస్తదో చెప్పాలి !"

నారిబాబుకు వాళ్ళక్కయ్య సినిమాకు తీసుకెడతానన్న విషయం చటుక్కున గుర్తొచ్చింది.

"వొద్దు. నే నింటికి వెళ్ళాలి. పనుంది. ఆలస్య మవుద్ది. నే పోతా !" అన్నాడు నారిబాబు.

"కాదు బాబూ ! ఆలస్యం కాదు. తొందరగానే పోవచ్చు. మాటల్లోనే టైం అవుతున్నది. కావాలంటే డబ్బిస్తాను. చాలా అవసరం బాబూ ! నువ్వు పోతే నా పరువు మంటగలసి పోతుంది......రా...రా కాస్తంత పుణ్యం గట్టుకో.

తాను వెళ్ళకపోతే ఆ పెద్దమనిషి పరువు ఎందుకు మంటలో కలుస్తుందో నారిబాబుకు అర్థం కాలేదు.

నారిబాబును ఒప్పించి, చెట్టు కిందున్న ఆచారికేసి తీసుకుపోయాడు లాల్చీ పెద్దమనిషి.

జులపాలు వేలాడుతున్న ఆచారిని చూడగానే నారిబాబుకు బాలనాగమ్మ సినిమామాంత్రికుడు గుర్తొచ్చాడు.

బాలనాగమ్మకి తీసికెళ్ళిందికూడా అక్కయ్యే అసలు నారిబాబు ఏసినిమా చూసినా వాళ్ళ అక్కయ్యతో కలిసే చూస్తాడు. బాగా చనువున్నదికూడా అక్కయ్యదగ్గరే !

వాళ్ళ నాన్నన్నా, పిన్ని అన్నా నారిబాబుకు చచ్చేంత భయం. 'అమ్మయ్యో ! ...... యింకేమన్నా వుందా? నాన్నారు చంపెయ్యరూ? అక్కయ్యచేత బట్ట లుతికించటంతో పాటు నా చర్మంకూడా ఉతికించి ఆరేయించదూ - పిన్ని !' అని బోల్డు సార్లు తన తోటిపిల్లల్తో చెప్పుకుని భయపడ్తాడు - నారిబాబు.

పిన్ని అక్కయ్యని దినమంతా గొడ్డుచాకిరీ చేయించికూడా కొడితే, అక్కయ్య ఎందుకు తనని పట్టుకుని ఏడిచేదో మొదట్లో తెలిసిందికాదు నారిబాబుకి. కాని అదేదో సినిమా చూసిన తర్వాత, దాంట్లో - మారు తల్లి, పిల్లల్ని కష్టం పెట్టటం చూసిం తర్వాత కొంతలో కొంతయినా నారిబాబుకి అర్థమయింది - పిన్ని అక్కయ్యనీ, తననీ ఎందుకట్లా తడవతడవకీ చీవాట్లు పెడుతుందో - ఎందుకు అక్కయ్యని పనిపిల్లలా చూస్తుందో ?

ఆచారి నారిబాబు కుడిచేతి అర చేతిలో అంజనం పూశాడు.

ఆచారి కళ్ళు మూసుకుని కను బొమలు పైకెత్తి మంత్రాలు గొణు క్కోవటం అచ్చు బాలనాగమ్మ మాంత్రికుడిలా అనిపించింది – నారి బాబుకి.

నారిబాబుకి అక్కయ్య గుర్తొ చ్చింది—

"ఆఁ... చూడు బాబూ..."

ఆచారి గొంతు మరీ మాంత్రి కుడిలా లేకపోవటం, అచ్చు పిన్ని కొట్టినప్పుడల్లా పక్కింటి మేష్టారు తనని ఓదార్చటంలా వున్నందుకు ఆశ్చర్యం వేసింది – నారిబాబుకు.

"ఊఁ" అన్నాడు నారిబాబు.

"నీ కిందులో ఏం కనిపిస్తున్నది?" ఆచారి నారిబాబుని అడిగాడు.

"ఎందులో...? ఈ నల్లటి రంగు లోనా?... ఏం లేదు."

"ఏం లేదా?... సరిగ్గా చూడు!"

"చూస్తున్నా...ఏం కన్పించందే?" నారిబాబుకి చిరాకేసింది.

"చూడూ..."

"చూస్తున్నా!"

"సరిగ్గా చూడు!"

"సరిగ్గానే చూస్తున్నా..."

"కొండ కనిపించటం లేదా?" ఆచారి గొంతు పెద్దదిచేసి అడిగాడు ...నారిబాబుకి ఏమీ కన్పించలేదు.

"లేదా?" మళ్ళీ అడిగాడు ఆచారి.

"................."

"సరిగ్గా చూడు... పెద్దకొండ... లేదా?......పోనీ...చెట్టు కనిపిస్తు న్నదా?"

నారిబాబుకి అదీ కనిపించలేదు. కళ్ళు పెద్దవిచేసి పరీక్షగా చూశాడు. ఏమీ కన్పించలేదు.

"ఏమిటి? చెట్టు......చెట్టు కని పించటం లేదా?"

"................."

నారిబాబుకి సినిమా గుర్తొచ్చింది. అక్కయ్య తనకోసం ఎదురు చూస్తూ వుంటుంది. నారిబాబుకి అక్కయ్య ఎదురుచూడటం యిష్టంలేదు.

"చెట్టు?" మళ్ళీ అరిచాడు.

ఆచారి అరవటం నారిబాబుకి నవ్వొచ్చింది.


"సరిగ్గాచూడు...సరిగ్గాచూడు..." లాల్చీపెద్దమనిషి నారిబాబు వీపు తట్టాడు.

నారిబాబు లాల్చీపెద్దమనిషి కేసి చూశాడు. లాల్చీ పెద్దమనిషి మొఖంలో కంగారు కనిపించింది. ఆయ నెందు కలా కంగారు పడుతు న్నాడో అర్థం కాలేదు నారిబాబుకి.

"మళ్ళీ చూడు! కొండ కనిపి స్తుంది .. చూడు," ఆచారి.

"................."

"ఊఁ......లేదా?"




నారిబాబు కాస్సేపాగి "ఆఁ! కనిపిస్తున్నది," అన్నాడు. మనసులో మటుకు ఓసారి భయపడ్డాడు.

'అబద్ధాలు చెప్పకూడదు,' అని మేష్టారు చెప్పటం గుర్తొచ్చింది. "మరి నాకోసం అక్కయ్యక్కడ ఎదురు చూస్తోంది. నేను తొరగా యింటికి పోవాలి. అందుకని చెప్పాను,'' అని సరిపెట్టుకున్నాడు నారిబాబు.

"కనిపించిందా? చెప్పలేదూ? నేను చెప్పలేదూ?.. ఊఁ - యిప్పుడు మళ్ళీ చూడు - చెట్టుకూడా కనిపిస్తుంది!" ఆచారి సంతోషంగా అరిచాడు.

నారిబాబుకి వాడట్లా అరవటం బావుండలేదు——

ఈ పీడ త్వరగా వదిలించుకోవా లనుకున్నాడు——

"చెట్టు—?''

"ఊఁ—కనిపిస్తున్నది,"

"ఇంకా—దూరంగా మిల్లు కనిపిస్తున్నదా?"

"ఏమిటీ మిల్లా? ఊఁ... కనిపిస్తున్నది."

"ప్రక్కన రైలుస్టేషనూ?''

''అవునవును .. కనిపిస్తున్నది—"

"ఫ్లాట్‌ఫారమ్మీద చింతచెట్టు?"

ఊఁ... చింతచెట్టు కన్పిస్తున్నది." — నారిబాబుకి అక్కయ్య సినిమాకని త్వరగా రమ్మనటం గుర్తొచ్చింది. తొందరగా పోవాలి... వీడు త్వరగా వదిలితే బావు ణ్ణనుకున్నాడు——

"చింతక్రింద సిమెంటు బెంచీమీద మనుషు లున్నారా?"

"ఉన్నారు—"

ఎంతమంది?"

నారిబాబు ఉలక్కిపడ్డాడు. ఎంత మంది అని చెప్పాలో తెలీలేదు...

"సరిగ్గా కనిపించటంలే!" దన్నాడు.

"సరిగ్గా చూడూ – యిద్దరులేరూ?"

"ఉన్నారున్నారు ... యిద్దరు !" నొక్కి అన్నాడు నారిబాబు.

"ఒక ఆడా... ఒక మగా! అవునా ?''

''అవును ''

——నారిబాబుకి తొందరగా వుంది.

''మగాడు చారలచొక్కా వేసుకున్నాడుగదూ ?''

"అవును.''

"తెల్ల పాంటూ... !''

''అవును''

''చాలు చాలు.'' ఆచారి నారిబాబు అరచేతిలోంచి అంజనాన్ని తుడిచేశాడు.

"దొ రి కి పొ య్యా డ య్యా భూపయ్యా! యింక నీ కొడుకు దొరికినట్టే! పోయి పట్టుకో పో!" ఆచారి లాల్చీపెద్దమనిషి భుజం తట్టి అన్నాడు.

లాల్చీపెద్దమనిషి రూపాయి తీసి నారిబాబు చేతిలో పెట్టి రిక్షాని కేకేస్తూ పరిగెత్తుతూ వెళ్ళిపోయాడు.

నారిబాబుకి అయోమయంగా వుంది చేతిలో రూపాయి చూసి అన్నీ అబద్ధాలని తెలిస్తే తంతారని యింటి కేసి పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు –

సందు తిరిగితే అక్కయ్య గుమ్మంలో కనిపిస్తుంది –

సందు తిరిగాడు—

అక్కయ్యకి తను ఆలస్యంగా రావటమువల్ల కోపం వచ్చివుంటుంది – వెళ్ళగానే జరిగిందంతా చెప్పా లనుకున్నాడు–

యింట్లోకి వెళ్ళాడు—

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది—

పిన్ని సన్నగా ఏడుస్తున్న శబ్దం – నారిబాబుకి భయం కలిగింది.

పుస్తకాల సంచీ, టిఫిన్ డబ్బా టేబిల్ మీద పడేసి పిన్ని గదిదగ్గరికి వెళ్ళాడు–

"పోనీలే సుశీ! వెధవముండ మన జానకి కాదనుకుంటే పోతుంది లే. మనకి మంచిదేకదా! భారం తగ్గింది. కాపోతే మరీ ... దానికి లేచిపోయేంత ధయిర్యం ఎక్కణ్ణుంచి వచ్చిందో నా కర్థం కావడంలేదు!" అంటూన్న నాన్నారి మాటలకి పిన్ని అడ్డొచ్చి –

''అందుక్కాదండీ నే నేడ్వటం – పింతల్లి పోరువల్లే లేచిపోయిందని లోకు లంటారనీ!" అంది.

వింటే విన్నాడుగానీ, నారిబాబుకి వాళ్ళ పిన్ని ఏడుపూ, నాన్నగారి మాటలూ అర్ధం కాలేదు. ఆ మంత్రకాడు తనను పిలవకుండా వుండివుంటే చక్కా అక్కతో తనుకూడా వెళ్ళివుండేవాడని ఒకటికి రెండుసార్లు అనుకుని భోరున ఏడ్చాడు.

——